ఆక్రమణలు.. ఆందోళన

నాయుడుపేట పట్టణ పరిధిలోని రెండు ప్రధాన కాలువల్లో చాలా వరకు ఆక్రమణలతో కనుమరుగైపోతున్నాయి. భారీ వర్షాలు పడితే నాయుడుపేట ముంపునకు గురికావడం తప్పనిసరి కానుంది. డ్రైనేజీ మురుగు నీటితోపాటు వర్షపు నీరు సైతం రెండుప్రధాన కాలువల నుంచి వెళ్లాల్సిన పరిస్థితులున్నాయి. ఈ కాలువలు పూర్తిగా ఆక్రమణల పాలవడంతో వరద నీటితో నాయుడుపేటకు ముంపు తప్పేలా లేదు.

– నాయుడుపేట టౌన్

- నాయుడుపేటలో ఆక్రమణలతో కనుమరుగైన ప్రధాన కాలువలు
- భారీ వర్షాలు కురిస్తే తప్పని ముంపు ముప్పు
- పట్టించుకోని అధికారగణం



ఆక్రమణల పాలైన నాయుడుపేట చాంద్రాయి చెరువు కాలువ

పట్టణంలో ప్రధాన డ్రైనేజీ కాలువల మురుగు నీరు మొత్తం చాంద్రాయి చెరువుకు సంబంధించిన కాలువ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. రెండోది పట్టణంలోని స్వర్ణముఖి నది నుంచి విన్నమాల చెరువు వరకు ఉండే విన్నమాల(సప్లయ్ చానల్) కాలువ. ఇది కూడా చాలాచోట్ల ఆక్రమణల్లో ఉంది. పట్టణ పరిధిలో ఉన్న మూడో కాలువ అన్నమేడు పంట కాలువ ఉంది. ఈ పంట కాలువ కూడా స్వర్ణముఖి నదికి అనుసంధానంగా ఉంది. ఈ కాలువలోకి చాలావరకు మురుగు నీరు చేరే అవకాశం లేదు. కేవలం స్వర్ణముఖి నది నుంచి వచ్చే నీరుతోపాటు వర్షపునీరు మాత్రమే పారుదల జరుగుతోంది. ఈ మూడు కాలువలు పట్టణ పరిధిలో మూడు కిలో మీటర్లకు పైగా ఉన్నాయి. ఈ కాలువల ఆక్రమణలతో నీటి ప్రవాహం సాగడం లేదు. ముఖ్యంగా పట్టణ పరిధిలో చాంద్రాయి చెరువు కాలువపై ఆక్రమణలు అనేకం ఉన్నాయి. ఈ కాలువ వెంబడి ఇరిగేషన్ శాఖతోపాటు ఆర్అండ్బీ, మున్సిపాలిటీకి సంబంధించిన స్థలులు సైతం ఉన్నాయి. పట్టణ పరిధిలోని కాలువలపై చిన్నపాటి సిమెంట్ పైపులు పెట్టడం, కొన్ని చోట్ల ఏకంగా కాలువ వెళ్లే దారిని మార్చేస్తూ చిన్నపాటి వంతెనలను నిర్మించేశారు. కాలువను పూర్తిగా ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఆక్రమణలు కళ్లకు కట్టినట్లుగా కన్పిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా విన్నమాల కాలువకు సంబంధించి పూడిక తీత పనులు కోసం కొత్తగా వచ్చిన ప్రభుత్వం రూ.38 లక్షలతో పనులు చేస్తోంది. అయితే ఈ పనులు అధికార పార్టీ నేతలు నామమాత్రంగానే చేస్తున్నారు. విన్నమాల కాలువ కూడా పట్టణ పరిధిలో చాలాచోట్ల ఆక్రమణలు చోటు చేసుకునిఉన్నాయి. కొన్ని చోట్ల కాలువపై ఏకంగా నిర్మాణాలు సైతం ఉన్నాయి. అదే విధంగా తుమ్మూరు నుంచి అన్నమేడు వరకు ఉన్న పంట కాలువపై ఆక్రమణలు చోటు చేసుకుని ఉన్నాయి. ఈ కాలువలపై ఆక్రమణలు తొలగించితే వర్షపు నీరు సాఫీగా వెళ్లే అవకాశం ఉంటుంది. ఆక్రమణలు పట్టించుకోక పోతే విజయవాడ తరహాలో నాయుడుపేట పట్టణం ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. కాలువలపై ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఆక్రమణలపై జిల్లా కలెక్టరైనా ప్రత్యేక దృష్టి సారించి నివారించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నపాటి సిమెంట్ పైపులతో అక్రమ రహదారి



మందకొడిగా మురుగు నీటిపారుదల

అధికారులు పట్టించుకోవడం లేదు



నాయుడుపేట పట్టణంలోని మురుగునీరుతోపాటు వర్షపునీరు వెళ్లేందుకు ఉన్న ప్రధాన కాలువలు చాలావరకు ఆక్రమణలకు గురయ్యాయి. ముఖ్యంగా చాంద్రాయి చెరువుకు సంబంధించిన ప్రధాన కాలువ పరిస్థితి చాలాదారుణంగా ఉంది. ఈ కాలువపై రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్ తోపాటు మున్సిపల్ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. భారీ వర్షాలు కురిస్తే నాయుడుపేట ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఆక్రమణలపై లోకాయుక్తలో కూడా ఫిర్యాది చేసి ఉన్నాను.

– తీగల భాస్కర్, సమాచార హక్కు ప్రచార సంస్థ, తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నాయుడుపేట

పరిశీలించి చర్యలు చేపడుతాం



నాయుడుపేట పట్టణంలోని చాంద్రాయి చెరువు కాలువతోపాటు పలు చోట్ల కాలువల ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలిస్తాం. అక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

– గీతావాణి తహసీల్దార్, నాయుడుపేట

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



నాయుడుపేటలో కాలువ ఆక్రమణలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపడుతాం. ఓజిలి మండలం నుంచి నాయుడుపేటకు కొత్తగా బదిలీపై వచ్చాను. పట్టణ పరిధిలోని కాలువ ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపడుతాం. – వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈ, నాయుడుపేట

క్లుప్తంగా

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



లింగంపాడులో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

దొరవారిసత్రం: లింగంపాడు, బూదూరు, వెదురుపట్టు, మోదుగులపాళెం గ్రామాల్లో గురువారం పల్లె పండుగ సందర్భంగా సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని సర్పంచ్ల ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టా. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు ఖాదర్మస్తాన్, ఎంపీటీసీ సుగుణ, సర్పంచ్లు వీణ, చెంగయ్య, చెల్లమ్మ, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

ఓజిలి: మానవమాల గ్రామంలోని బాబా ఆలయంలో భక్తులు సాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్తలు ఉచ్చూరు శోభారాణి, హరి నాథ్రెడ్డి బాబాకు పాలాభిషేకం చేశారు. మధ్యాహ్నం హారతులు, అభిషేకాలు చేసి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. సాయినాథునికి భక్తులు గజమాలతో పూజలు చేశారు. 300 మందికి పైగా గ్రామస్తులకు అన్నదానం చేశారు. రాత్రి భజనగీతాలు ఆలపించి పల్లకి సేవ చేపట్టారు.

గోడ ధ్వంసంపై పోలీసుల విచారణ



నిరసన తెలుపుతున్న చెందోడు గ్రామస్తులు

కోట: చెందోడులో శివలింగం అనే వ్యక్తికి సంబంధించిన ప్రహరీ గోడను బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొందరు ధ్వంసం చేశారు. ఇరువర్గాల మధ్య స్థల వివాదం నడుస్తున్న క్రమంలో గోడను ధ్వంసం చేయడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో గోడను పడగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ చెందోడు గ్రామస్తులు నిరసన చేపట్టారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. వివాదం పెద్దదవుతున్న క్రమంలో ఎస్ఐ పవన్కుమార్ ఇరువర్గాల వారిని పోలీస్ స్టేషన్కు పిలిపించి విచారించారు. ధ్వంసం చేసిన గోడను నిర్మించి ఇవ్వాలని, లేని పక్షంలో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దెబ్బతిన్న పూరిల్లు



కేశవరంలో దెబ్బతిన్న పూరిల్లు

కోట: భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టంపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. కేశవరానికి చెందిన ఏసుబాబు తన పూరిల్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తహశీల్దార్ జయజయరావుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలించారు. బాధితుడికి సాయం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మరో వైపు కోటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న 20 మందికి దాతల సహకారంతో భోజన సదుపాయం, వసతులు కల్పించినట్లు తహశీల్దార్ తెలిపారు.

గిరిజనులకు సరుకులు పంపిణీ



గిరిజనులకు సరుకులు అందిస్తున్న జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు: తీరప్రాంతంలో తుపాను కారణంగా ఇబ్బంది పడ్డ గిరిజనులకు జిందాల్ పవర్ ప్రాజెక్టు (సింహపురి యూనిట్) సహకారంతో ఫల సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని లింగవరం పంచాయతీలోని గోనుగుంట, తీగపాళెం, పల్లెవాని దిబ్బలలో నివాసం ఉండే గిరిజనులు రెండు రోజులపాటు తుపాను కారణంగా వారు పనులకు వెళ్లలేకపోయారు. సాగరమాల రహదారి నిర్మాణంలో భాగంగా వరద నీరు వారి ఇళ్లను చుట్టుముట్టింది. దీంతో గిరిజనులు ఆకలితో అల్లాడుతుండగా గుర్తించిన పరిశ్రమ ప్రతినిధులు వారికి సహకారం అందించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ సీఎస్ఆర్ కింద చేపడుతున్న సేవా కార్యక్రమాలలో భాగంగా పేదలకు అందుబాటులో ఉండి సాయం చేస్తామని అన్నారు. గిరిజన కుటుంబాలకు బియ్యం, పప్పులు, నూనె, ఉల్లిపాయలు, కూరగాయలు అందించారు. ఈ కార్యక్రమంలో లింగవరం సర్పంచ్ నాశిన సుబ్రహ్మణ్యం, యల్లసిరి కోటయ్య, బాలచెన్నయ్య, వేణుగోపాల్, శివకుమార్, సూర్యచరణ్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



జీలపాటూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమం

పెళ్లకూరు: రైతులంతా భూసార పరీక్షలు చేసుకొని నేల రకాన్ని బట్టి విత్తనాలు ఎంపిక చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ సూచించారు. గురువారం చిల్లకూరు, జీలపాటూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రబీ సీజన్ సాగు చేపడుతున్న రైతులందరూ కచ్చితంగా భూసార పరీక్షలు చేసుకుని విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. దుక్కి పనుల్లో భాగంగా పశు వ్యర్థాలతో పాటు పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేపట్టి భూసారం పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా కృత్రిమ ఎరువులు, రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించుకోవాలన్నారు.

నేటి నుంచి గ్రామ సదస్సులు

పెళ్లకూరు: మండలంలో రీసర్వే పూర్తి అయిన రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం నుండి స్థానిక తహసీల్దార్ ద్వారకనాథ్రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నట్లు గురువారం డీటీ యువరాజ్ తెలిపారు. ఈ నెల18న తాళ్వాయిపాడు, 19న జీలపాటూరు, 21న కానూరు, 22న పెన్నేపల్లి, 23న బంగారంపేట గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు భూసమస్యలను రెవెన్యూ అధికారులకు విన్నవించి, పరిష్కరించుకోవాలని సూచించారు.

తీరం దాటిన తుపాన్



సూళ్లూరుపేట పట్టణాన్ని కప్పేసిన పొగమంచు



జాతీయ రహదారిపై మంచు తెరలు

సూళ్లూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ తీరం దాటడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి వాయుగుండంగా మారి తిరుపతి, నెల్లూరుజిల్లాలను భయపెట్టింది. వరదొస్తే ఎదుర్కోవడానికి అధికారగణం అంతా కూడా సిద్ధమైపోయింది. అయితే వాయుగుండం తడ వద్ద తీరం దాటి భూమి మీదకు వచ్చింది. తీరం దాటే సమయంలో దాని తీవ్రత బాగా తగ్గిపోవడంతో ఎలాంటి ప్రభావమూ లేకుండా పోయింది. ఈ వాయుగుండం భూమి మీద తీరం దాటడంతో గురువారం తెల్లవారుజాము నుంచి 8 గంటలకు సూళ్లూరుపేట పట్టణాన్ని పొగమంచు కప్పేసింది.

378.2 మి.మీ వర్షపాతం

వాయుగుండం ప్రభావంతో 14వ తేదీ నుంచి 17 దాకా 378.2 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలియజేశారు. ఈ నెలలో సాధారణ వర్షపాతం 260.3 కాగా దీనికంటే ఎక్కువ వర్షపాతమే నమోదైంది. నియోజకవర్గంలో కాళంగి నది, స్వర్ణముఖి నదులు స్వల్పంగా ప్రవహిస్తున్నారు. కరిపేటి కాలువ, పాములకాలువ, మామిడికాలువ, దొండకాలువ, కన్నా కాలువ, మల్లె కాలువ కూడా నిండుగా ప్రవహిస్తున్నారు. కాళంగి నది నుంచి నెర్రికాలువకు నీళ్లు రావడంతో సూళ్లూరుపేట, తడ మండలాల్లో చెరువులు నిండుతున్నాయి. పులికాట్ సరస్సుకు కూడా స్వల్పంగానే నీళ్లు చేరాయి. అయితే మరో వాయుగుండం బంగాళాఖాతంలో ఏర్పడిందని, ఈ నెల 20 నాటికి అది కూడా నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోనే తీరం దాటుతుందని వాతావరణ శాఖ వారు తెలియజేస్తున్నారు.



వరినాట్లు వేయడానికి నారు తీస్తున్న కూలీలు



జోరుగా వరినాట్లు

వరి సాగుపై సమగ్ర అవగాహన అవసరం

వెంకటగిరి రూరల్: రబీ సీజన్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు వరి పంట సాగుపై సమగ్ర అవగాహన అవసరమని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని కుర్చాగుంట, బుసపాళెం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో సాగు చేయాల్సిన విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్ఎన్ఆర్–15048 రకం, సాగు పద్ధతులపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, ఎంపీఈఓ రామ్మోహన్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బెల్టు ప్రాంతాలే కావాలి

– మద్యం వ్యాపారుల లాబీయింగ్

చిల్లకూరు: అనుకున్న మేర మద్యం దుకాణాలు మొత్తంగా నియోజకవర్గంలో సిండికేట్తో దక్కించుకున్నారు. ఎక్కువ సంఖ్యలో పారిశ్రామిక వేత్తకు సంబంధించిన సిండికేట్ దారులకే షాపులు దక్కాయి. దీంతో ప్రజాప్రతినిధి ద్వారా దక్కించుకున్న సిండికేట్ వారు తమకు ఫలానా చోట షాపు కావాలని సిద్ధమవుతున్న సమయంలో పారిశ్రామికవేత్తకు చెందిన సిండికేట్దారులు అక్కడ బెల్టు బాగా జరుగుతుంది. ఆ ప్రాంతంలోనే షాపు వచ్చేలా చూడాలని పట్టుబడుతున్నారు. దీంతో ప్రజా ప్రతినిధికి, పారిశ్రామిక వేత్తకు మద్యం షాపులు సర్దుబాటు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ప్రభుత్వం అనుమతులు ఇచ్చి రెండు రోజులవుతున్నా, పూర్తి స్థాయిలో మద్యం షాపులు ఇంకా ఏర్పాటు చేయలేదనే విషయం సుస్పష్టం. ప్రభుత్వం గతంలో ఉన్న మద్యం షాపుల్లోని సరుకును మాత్రమే విక్రయిస్తున్నారు. అయితే ఇక్కడ ప్రభుత్వం ప్రకటించిన రూ.90 మద్యం ఒక్క సీసా ఒక్కటి కూడా దొరకడం లేదు.

నారుమడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

నాయుడుపేట టౌన్: అధిక దిగుబడులు సాధించేందుకు వరి నారుమడుల యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారి జోగి గణేష్ రైతులకు అవగాహన కల్పించారు. మర్లపల్లి, అత్తలపాళెం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. వీఏఏలు చెంగలరాజు, ఆదినారాయణ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోట: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఇన్చార్జ్ ఎంపీడీఓ వేణు గురువారం తెలిపారు. ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

వైఎస్ఆర్ సీపీ నాయకుడికి నివాళి



రమణారెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు

దొరవారిసత్రం: తనియాలి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ చెన్నూరు రమణారెడ్డి(62) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం రాత్రి చెన్నైలోని ఆస్పత్రి నుంచి ఆయన భౌతికకాయం గురువారం స్వగ్రామానికి చేరుకుంది. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేనాటి రామచంద్రారెడ్డి, వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డి, సతీష్రెడ్డి, దువ్వూరు గోపాల్రెడ్డి, సురేష్రెడ్డి, జకరయ్య ఉన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఏఓ హైమావతి

సైదాపురం: రైతులు సాగు చేసే ప్రతి పంటను ఈ–క్రాప్ కిద నమోదు చేసుకోవాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని చాగణం రైతు భరోసా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటల సాగుకు కూడా రైతులు సన్నద్ధం కావాలని కోరారు. ప్రతి రైతు ఈ–కేవైసీ చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు కూడా గుర్తింపు కార్డులను మంజూరు చేస్తున్నట్లు ఆమె వివరించారు. రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను పాటించాలని, ప్రధానంగా సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు మినీ గోకులాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై షేడ్నెట్స్, ఫారంపాండ్స్, డ్రిప్ వసతులను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నిమ్మ తోటలను కూడా ఆమె సందర్శించారు.

ముత్యాలమ్మ ఆలయంలో చండీ యాగం



చండీ యాగం నిర్వహిస్తున్న అర్చకులు

చిల్లకూరు: లోక కళ్యాణార్థం ప్రతి పౌర్ణమి రోజున అమ్మవారి ఆలయంలో చండీ యాగం నిర్వహిస్తున్నట్లు ముత్యాలమ్మ దేవస్థానం ఈఓ నవీన్కుమార్ తెలిపారు. గురువారం పౌర్ణమిని పురస్కరించుకుని ముత్యాలమ్మ ఆలయంలో చండీ యాగం నిర్వహించారు. అనంతరం యాగ ఫలాలను ఉభయకర్తలతో పాటుగా, భక్తులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో ప్రతి పౌర్ణమికి చండీ యాగం నిర్వహించేలా ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ ఇంద్రసేనమ్మతో కలసి నిర్ణయం తీసుకుని దీనిని కొనసాగిస్తున్నామని అన్నారు. అమ్మవారికి పలు కలశాలు ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు. ఈ చండీ యాగం నిర్వహించేందుకు భక్తులు ముందుకు వస్తున్నారని, ఏడాదిలో వచ్చే 12 పౌర్ణమిలకు పలు గ్రామాలవారు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే గూడూరు టమాటా మర్చంట్ సెల్వరాజ్, దేవి దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్ స్వామి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

శిశురక్షలో అరుదైన శస్త్రచికిత్స



గడ్డను తొలగించిన వైద్యులు

సూళ్లూరుపేట రూరల్: పట్టణంలోని తాజ్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శిశురక్ష ప్రైవేట్ వైద్యశాలలో ఓ మహిళ కడుపులోని గడ్డను శస్త్రచికిత్స చేసి తొలగించారు. తడ మండల చిన్న మాంబట్టు గ్రామానికి చెందిన జి.భారతి అనే మహిళ(47) కడుపు నొప్పి అని సూళ్లూరుపేటలో ఉన్న శిశురక్ష వైద్యశాలలోని గైనకాలజిస్టు డాక్టర్ మాధురిని సంప్రదించారు. వైద్యురాలు మహిళకు అన్ని వైద్య పరీక్షలు, వివిధ స్కానింగ్ టెస్టులు నిర్వహించారు. కడుపులోని ఎడమ వైపు అండాశయంలో పెద్ద గడ్డ ఉన్నట్లు తెలియడంతో వైద్యురాలు మాధిరి వారి సిబ్బందితో రెండు గంటలపాటు శ్రమించి ఆపరేషన్ నిర్వహించి, గడ్డను తొలగించారు. దీని బరువు 6.5 కేజీలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ గడ్డను ఉన్నత వైద్య పరీక్షలకు పంపించినట్లు తెలిపారు.

పంట పొలాల పరిశీలన




వర్షాలకు దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

కలువాయి: మండలంలో వరద ప్రభావిత పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు సమన్వయకర్త డాక్టర్ జి.లలిత శివజ్యోతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించింది. గాలీవానలకు నేలవాలిన వరిపైరును నిలబెట్టి చెరకు గడల్లా కట్టాలని, 5 శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ దేవి, కేవీకే శా స్త్రవేత్త డాక్టర్ డి.విజయకుమార్ నాయక్, మండ ల వ్యవసాయాధికారి ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

జలపాతాల హొయలు





కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని జలపాతాలు ఉధృతంగా జాలువారుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు జలపాతాల వద్దకు చేరుకుంటున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శించుకున్న అనంతరం జలపాతాల అందాలను తిలకిస్తున్నారు.

– రాపూరు

కాళంగి పరవళ్లు



తనియాలి గ్రామ సమీపంలో కాళంగి నది

దొరవారిసత్రం: మండల పరిధిలో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు పలు కాలువలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. అదే విధంగా కాళంగి నది గురువారం వరద నీటితో నిండుగా ప్రవహిస్తోంది. నెర్రికాలువ, కన్నాకాలువ, పాల కాలువలు కూడా వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. గురువారం వర్షం ఆగడంతో కాళంగి నది, ప్రధాన కాలువల్లో వరద నీటి ఉధృతి తగ్గడంతో ప్రజల రాకపోకలకు ఎక్కడా అంతరాయం ఏర్పడలేదు.

జలమయం

భారీ వర్షాలకు తనియాలి, కృష్ణప్పకండ్రిగ తదితర గ్రామాల రోడ్లుతోపాలు పలు గ్రామాల్లోని వీధులు జలమయంగా మారాయి. మోదుగుపాళెం, తనియాలి, కట్టువాపల్లి, కల్లూరు, కారికాడు, మీజూరు తదితర గ్రామాల్లోని వీధులు వరద నీటితో నిండిపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు.



మావిళ్లపాడు గ్రామ వద్ద నెర్రికాలువ



తనియాలి గ్రామలో జలమయమైన రోడ్డు